

ప్రయోజనంలేని పశ్చాత్తాపం

చెమటూడ్చి తల్లితండ్రులు చాలా కాలం నుండి చదువుచెప్పిస్తున్నారనే సంగతి తెలిసికూడ విద్యార్థి పరీక్షలో తప్పేడు. మైనార్టీ తీరిన ఆ విద్యార్థి, పరీక్ష పోవడంచేత సంఘంలో తనకు గౌరవం లేదని ఒక అంచనా వేసుకున్నాడు. తండ్రి చదువుచెప్పించడం మాని వేస్తాడు. నానా చీవాట్లు పెడతాడు. ఇంటికి వెళ్ళడంకంటె మరణం సుఖం—అనుకుని- చచ్చి సాధించేదేమిటి? ఈ మహా ప్రపంచంలో ఏమూలైన బ్రతుకలేనా? వెంటనే ఊరు విడిచి వెళ్లిపోవాలి, అనుకున్నాడు.

కొంతదూరం నడక - దారిలో ఎండ- దాహం- ఆకలి- కాళ్లుపీకు- నీర్సం- జేబులో చిల్లికానీతో సిగరెట్టుకొని గట్టిగా

"ఒక విద్యార్థి"

ఒక్క గుక్క లాగి రైల్వేస్టేషను చేరుకున్నాడు. టిక్కెట్టులేకుండా ప్రయాణం చెయ్యాలి. ప్రక్కనున్న పొలాల్లో నుండి స్టేషను పాయిఖానాదొడ్డుల ప్రక్కనుంచి ప్లాటుఫారం చేరుకున్నాడు. రైలునుండి మరోస్టేషనులో దిగేడు. పరిచయస్తులు లేని గ్రామం. చీకట్లో- అక్కడక్కడ- రోడ్డు ప్రక్కనున్న- లైట్లవెలుగులోంచి- నడక- బహునీర్సం. విశ్రాంతికి సన్యాసిమఠం పొలిమేర ముందరనే కనిపించింది. రోడ్డు దుమ్ము కాలితో మఠంలో ఒక అరుగు మీద కూర్చున్నాడు.

సంపాదించిన అన్నము తిని- హాయిగా గంజాయి పీలుస్తున్నారు ముగ్గురు నలుగురు సన్యాసులు కలసి. "ఆహాంయ్" "జై సీతారామ్" అంటున్నారు. చెమటూడ్చకుండా కడుపునిండ తిండి దొరికింది. అద్దెలేని మఠంలో గట్టిగా దమ్ములాగుతూ, ఖులాసా కబుర్లు చెప్పుకుని ఆనందిస్తున్నారు. అవును. పేరుప్రతిష్టలు ఎవరికొవ్వాలి? ఏ మానవుడైనా ముఖ్యంగా తిండి సుఖమే గా కోరేది? ఆ బ్రతుకు ఏదైనా బ్రతుకే- బితుకు సమాజంలో సభ్యత్వం చవక-" అనుకుంటున్నాడు విద్యార్థి.

"ఎవరు, బాబూ?" మానవునికి గోమాలు తప్పవన్నట్టు ఈ ప్రశ్న వచ్చిన తరువాత కూడ తప్పదనుకుని "ఈరాత్రికి పరుందామని," అన్నాడు.

"ఖాళీలేదు, బాబు. మేము చాలామంది వున్నాము. మీవంటివారు ఈ సన్యాసి మఠంలో నిద్రేమిటి?"

"కాషాయవస్త్రాలు లేవని సన్యాసులు చేర్చుకోలేదు. ఖద్దరు బట్టలు లేక పోతే... గౌరవించరు." అనుకున్నాడు. గ్రామంలో ప్రవేశించేడు. అంతగా అరుగులు లేవు. ఉన్నచోట కుక్కలు- మేకలు. అరుగులు చిన్నవి. ప్రవేశించేడు. కుక్కలు కరవడానికి వచ్చేయి. మమ్మల్లను ఎక్కడికి పొమ్మంటావు, అన్నట్టు లేచి నిలబడ్డాయి మేకలు. నిట్టూర్పుతో- రోడ్డు ప్రక్కగా నడుస్తున్నాడు.

"రైలు పట్టాలమీద తల పెడితే?" నాలుగురోడ్ల జంక్షన్లో నిలబడి ఆలోచించేడు. "ఇంతచదువు చదివి తల్లిదండ్రులను సుఖపెట్టడం మాని, ఇటువంటి పనులు చేస్తే ప్రయోజనం ఏమిటి?"

సినీమా రెండో ఆట సహం అవుతున్నది. కాపలా వాళ్లూ, పోలీసువాళ్లూ తిరుగుతున్నారు.

"ఎవరు మీరు?"

"మాది కాకినాడ-పరుండడానికి స్థలం కావాలి."

"వీడెవడో దొంగలాగున్నాడు. లేక కన్యాన్నిష్టా!" ఈఅనుమానంతో వున్నాయి వాళ్ల నేత్రాలు.

తిరిగి రైల్వేస్టేషను చేరుకున్నాడు. అక్కడున్న బెంచీలమీద జనం కాళ్లు చాపుకుని గురకపెట్టి నిద్రపోతున్నారు. కొంతమంది క్రింద బెడ్డింగులు, దుమాళ్లు వేసుకుని నిద్రిస్తున్నారు. మధ్య మధ్య ఉమ్ములు. స్టేషను ఆఫీసర్ల లొసలు- గణగొణలు. ఎక్కడా ఖాళీస్థలం లేదు నిద్రపోడానికి. పలుచగా ప్లాటుఫారంమీద నిద్రిస్తున్నారు. పుచ్చపూలవంటి వెన్నెల- అమితమైనచలి. నలుప్రక్కల పరికించి- "చలిలో ఏవిధంగా పరుండేది?" అనుకున్నాడు. ఇటు అటు తిరిగేడు. ధూమపానం వేపు ప్రాణం లాగింది. క్రింద ఎంగిలి పీకెలు కనిపిస్తున్నాయి.

"బాబూ? ఏ ఊరు వెళతారు?" మేలిముసుగుతో అర్ధరాత్రిలో ఏకాంతముగా వచ్చి ముసుగు తీసింది, యువతిని సుమా అని తెలియచెం కొరకు. వెన్నెలలో నేత్రాలు- మెరిసేయి. ఇదే నావృత్తి అనేటట్టు చూచింది.

చెట్టునీ క్రింద వున్న పాయిఖానాదొడ్డి వేపు, సూదులవలె గుచ్చుకుంటున్న సిరిరాళ్ళను త్రొక్కుకుంటూ నడుస్తుంటే- ఫలందొరికిందనే ఆశతో వెంబడించింది. దొడ్డిదాటి రైల్వే ఇనుపబద్దీలతో అంతమైన ప్రాకారం దగ్గర ఆగేడు. "పరుచుకోడానికి తువాలైనా లేదు" అంటూ నీరసంగా కూర్చున్నాడు. బాబూ- ఏం?"

"చిల్లరేమైనా ఉన్నదా? వుంటే... వొకర్ధణా ఇస్తే సిగరెట్లు పట్టుకువస్తాను." అర్ధణాతో రెండు సిగరెట్లు కొని ఒకటి ఎఱ్ఱగా కాల్చుకుంటూ యథాస్థానానికి వచ్చేడు.

"మిమ్ములను లైటువెలుగులో చూచాను," అన్నది.

"తినడానికి ఏమీ లేదూ? ఏమైనా కొని తీసుకురా కూడదూ! అరటిపళ్లు కడుపునిండుతాయి."

ఆమెవెళ్ళింది.

"నేను నిర్భాగ్యుణ్ణని తెలియలేదు ఆమెకు." అనుకున్నాడు.

చిరునవ్వుతో పళ్లుపట్టుకు వస్తే యిద్దరూ మౌనంగా పూర్తిచేశారు. కడుపు పగిలేటట్లు కుళాయిదగ్గిర మంచినీరు పట్టించటానికి లేచేడు.

"అమ్మయ్య!" మూతినుండి నీళ్లు తుడుచుకుంటూ అన్నాడు. నిట్టూర్పు విడుస్తూ, ఆడజన్మ ఎత్తినా బాగుండును అనుకున్నాడు.

యథాస్థానానికి చేరుతుంటే అతని నీడతో పోటీగా వెంటబడింది యువతి.

"దీనిమీద పరుండండి." దుప్పటి పరచింది.

దూరంగా క్రింద చతికిల పడ్డాడు.

"ఏమండీ?" ప్రశ్నించింది.

"ఏంకావాలి? నీ డబ్బుతో ఆకలిమంటలు చల్లార్చుకుని, సుఖంగా చలినుండి తప్పించుకోడానికి యీ సిగరెట్టు కాలుస్తున్నాను. ఒక్కకానీకూడా లేదు దగ్గిర." యువతి ముఖంలో కళలు మారేయి. చంద్రుడు మబ్బులలో ప్రయాణం చేస్తున్నాడు. కొంతసేపు మౌనం.

చంద్రుడు బయటపడ్డాడు. దూరాన్న కొరియాయుద్ధంలోకి వెడుతున్న లారీలాగ, లావుగా, బరువుగా ఒకవ్యక్తి వస్తున్నాడు. దుప్పటి తీసుకుని అతని వేపు వెళ్లిపోయింది.

ఆకలితీరినా అక్కడ భయంగా ఉంది. స్టేషన్లోకి తిరిగివచ్చేడు. పెద్దపెద్ద బెళ్ళమీద తమ స్వంత మన్నట్టుగా నిద్రిస్తున్నారు. "కాళీవుంటే బాగుండును ఎక్కడా ఖాళీలేదు."

చిన్నమూల పరుండుటకు వీలుగా ఉంది. చీకటి తెల్లుంటాయేమో! అనుభవించవచ్చు. కాళ్లు ముడుచుకుని పరుంటే మత్తుగా నిద్రపట్టింది.

పెద్దకూతలతో,చప్పుడుతో రైలువచ్చింది. నిద్దరలో అనేకమైన ధ్వనులతో మాటలు వినిపిస్తున్నాయి. నిద్ర సుఖం లేవనివ్వలేదు. ఎండ వచ్చింది. ఎక్కడచూచినా పారవేసిన పండువు పుడకలు, ఇంకా కొంతమంది పళ్లతోముకుంటున్నారు. అక్కడక్కడ నోటిలో తెల్లని నురుగుతో బ్రషులు ఆడుతున్నాయి. కొళాయి ఖాళీ లేదు. కాలవగట్టు వేపు వెళ్లేడు. అవశిష్టములు తీర్చుకుని నెమ్మదిగా వచ్చేడు స్టేషన్లోకి. హోటల్ హడావిడిగా ఉంది. ఆకలి దహిస్తున్నది. పంట్లాం జేబులో రెండు చేతులు పెట్టి "ఖాళీ," అన్నాడు.

మిషన్ చక్రాలవలె బుర్రనిండా అనేక విషయాలు తిరుగుతున్నాయి. "అమ్మ గుండె బాదుకుంటూ ఏడుస్తూంటుంది. తిండి లేకుండా తండ్రి తిరుగుతూంటాడు ఎక్కడైనా కనిపిస్తానేమో నని. అమ్మకు అసలే గుండె దడ. ఏమై పోతుందో! ఇంటికి వెళ్ళిపోతేనే బాగుంటుంది. ఇంత చదువు చదివినా ఒక కానీ తెచ్చుకో లేకపోయాను. పైగా ముష్టి ఎత్తవలసి వచ్చింది. అమ్మా నాన్నా దగ్గర ఉంటే యీ అవస్థ ఎక్కడిది? ఇంటికి చేరుకోవాలి రైలు వస్తే బాగుండును."

కళ్లు లోతుగా పోయేయి. తల ఎండిపోయి చికిబికిగా ఉంది. పిచ్చి ఆకారం జాగ్రత్తగా స్వగ్రామంలో దిగి వెడుతుంటే స్నేహితులు, "ఎక్కడికి వెళ్ళేవ్? ఏమిటి విశేషాలు? మీ నాన్న వెతుకుతున్నాడు," అన్నారు. ఇదేరకం ప్రశ్నలు చాలా వినిపించేయి. బరసైన సైకిలు మాదిరిగా ముందుకు సాగుతున్నాడు.

బావురుమంది తల్లి. నానా చీవాట్లు తిన్నాడు తండ్రిచేత. "పరీక్షపోతే ఈసారి శ్రద్ధగా చదువు."

తల్లితండ్రులతో పాటు అత్మకూడా చెప్పింది. "ఇంతధనం ఖర్చుచేసి చదివిన దానికి కానీ తేలేక యెన్ని కష్టాలు పడ్డావో తెలుసా? "స్వగృహే పూజ్యతే

గనోక్యూర్
అన్నిసెగలకు,గంటలలోగుణము
ఈశ్వర ఫార్మశీ, రాజమండ్రి.

మూర్ఖః. అమ్మా బాబూ లేకపోతే యిప్పుడు నాగతి ?" అని తన ఆత్మ ప్రబోధించింది.

*   *   *   *

పాఠశాలలో చేరిన కొన్ని రోజులకు పాఠాలు మొదలుపెట్టేరు. "ఫెయిలైన లిస్టులో వాడవే ? ఇంక ఆ దర్జాలు మాను," అన్నట్టు చూస్తున్నారు యితరులు. "ఈ వేళ నీరసంగా ఉంది. రేపు తెల్లవారు ఝామున లేచి తప్పకుండా చదువు ప్రారంభిస్తాను." శ్రద్ధగా చదవడానికని నిశ్చయించుకు న్నాడు ఆవిధంగా.

తెల్లవారుకట్ల మూడుగంటలకు మెలకువ వచ్చింది. "మూడుగంటల నుండి చదు వేమిటి ? హెల్తు పాడౌతుంది 4 1/2కు లేచి చదువుతాను." ముసుగు తన్ని పెట్టి పరున్నాడు.

కాకులు కూశాయి. కల్యాపులు పూర్తి అయ్యేయి. పందులు ఊరి వెలుపలకు బయ ల్దేరేయి. కాఫీహోటలుకు చరచరా నడు స్తున్నారు. ఎండ ప్రకాశంగా ఉంది.

"ఇంత ఎండఎక్కిన తరువాత చదు వేమిటి ? సుఖంగా స్నానం చేసి, భోజనం చేసి హోమ్‌వర్క్ చేసి స్కూలుకి వెళ్ళి పోతాను." అని అనుకున్నాడు.

ఎనిమిదిన్నర అయింది. లెక్కలు చేయ టానికి కూర్చున్నాడు. లెక్కలు రావడం లేదు. విసు గెత్తుతున్నది. "స్కూల్లో అడుగుతాను." అనుకుని మూసి వేసేసేడు, స్నేహితులతో స్కూల్‌కి వెళ్ళేటప్పటికి ఫర్‌స్ట్ బెల్ అయింది.

"పాఠాలు జాగ్రత్తగా ఆలించి రాత్రి నుండి శ్రద్ధగా టైమ్ టేబల్ ప్రకారం చదువుతాను."

సాయంత్రం అయింది. సినీమా మారింది. "ఈ వేళ సినీమా చూచి తెల్లవారుఝామున లేచి ఖచ్చితంగా చదువుతాను," అని ధృఢంగా అనుకున్నాడు.

రాత్రి పరుండే టప్పడికి పదిన్నర అయింది. తెల్లవారుఝామున చలిగా ఉంది. ముసుగునుండి, "చలిలో చదు వేమిటి ? వెధవ పాఠాలెంతసేపు వస్తాయి? ఒక్కసారి జాగ్రత్తగా చదివితే వస్తాయి," అనుకున్నాడు.

యధాప్రకారంగా ముసుగునుండి లేచే టప్పటికి ఎనిమిదైంది. "ఈ వేళ 28 తారీకు ఒకటో తారీకు నుండి జాగ్ర త్తగా ఏ రోజు పాఠాలు ఆ రోజు చదువు తాను. పరీక్ష ఇంకా ఆరుమాసా లుంది. ఈ లోగా చదవ తే నేమిటి ? దసరా క్రిష్ట మస్ సెలవులు, శని ఆది వారాలు, బోలె డన్ని ! పేసవచ్చు." అనుకున్నాడు.

అర్థపరీక్షలు వచ్చేయి.

"స్లిప్పులు పట్టుకువెళ్ళి వ్రాస్తాను. ఏన్యూల్‌కి శ్రద్ధగా చదువుతాను, ముమ్మాటికి."

అర్థపరీక్షలో స్లిప్పులు పట్టుబడుటచే పదులు, పదిహేన్లు మార్కులు వచ్చేయి.

"ఈ వేళ కాదు. రేపటినుండి చదవక పోతే వట్టు ! ఈ వేళ బద్ధకంగా ఉంది."

మర్నాడు. "ఈ వేళ రాత్రి ఆరుగంటల నుండి పన్నెండు, ఒంటిగంటవరకు, చది వేస్తాను, పాతవీ కొత్తవీ."

రాత్రి తలదగ్గిరదీపం... మంచంమీద పడక. గుండెలమీద పుస్తకం ఆన్చి చదువు తున్నాడు. కొంతసేపటికి పుస్తకం గుండె లమీద నిద్రపోయింది. నిశి రాత్రిలో ఎప్పుడో పుస్తకం ప్రక్కలో పడి నలిగి పోయింది.

బద్ధకంతో ఎనిమిది గంటలకు లేచి, "ఛా ! ఈ వేళ రాత్రి కూర్చుని చదువు తాను. పెద్ద పరీక్షలు దగ్గరకు వచ్చేయి. ఎక్కడేనా ప్రయివేటు పెట్టాలి," అనుకున్నాడు.

రాత్రికి చాపమీద కూర్చుని గోడకు జార్లపడి చదువుతున్నాడు. దీపం దేదీప్య మానంగా వెలుగుతోంది.

"నడుం లాగుతున్నది"

పుస్తకాలు తలక్రింద పెట్టి పరుండి చదు వుతున్నాడు. కొంతసేపటికి హాయిగా, తెలియకుండానే, నిద్రపట్టింది.

పెద్దపరీక్షలు పదిహేను రోజు లున్నాయి. "రాత్రులు టీ త్రాగాలి, లేక పోతే నిద్ర వస్తోంది," అని నిశ్చయించు కున్నాడు. రెండుగంటలకో అరకప్పు.

"టీ అమిత పైత్యం రాత్రి పడ్డది. కళ్ళు తిరుగుతున్నాయి. నిద్ర ఆగటం లేదు ఇన్ని పాఠాలున్నాయి. ఏం చదవను ? ఎప్పటికి వస్తాయి? ఒకటా, రెండా పాఠాలు?"

తెల్లవారుఝామున మూడు గంటలకు లేవడానికి అలారం పెట్టేడు. అలారం కొట్టగానే బద్ధకంతో లేచి, మంచం మీదనుండే దీపం హెచ్చించి చదువు సాగి స్తున్నాడు కళ్లు కూతలు పడుతున్నాయి.

"ఇప్పుడు కాదు. ఆరుగంటలకి లేచి చదువుతాను." దీపం ఆరిపోయింది, పుస్తకం తలగ్రక్రింద నలిగింది.

పెద్దపరీక్షలు రేపటి నుండి !...